ప్రజాశక్తి
శుక్రవారం 10 మే 2024
I
అల్లూరి సీతారామరాజు

రోడ్డు నాణ్యతను పరిశీలించిన అధికారులు

ప్రజాశక్తి-అనంతగిరి: మండలంలోని గుమ్మ పంచాయతీ పరిధి కర్రిగోడ, కడరేవు గ్రామాల్లో నిర్మించిన రోడ్డు పనుల నాణ్యతపై సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కె.గోవిందరావు, గ్రామస్తులు రాజారావులు జిల్లా కలెక్టర్, పిఓ, క్వాలిటీ కంట్రోల్ అధికారులకు లిఖితపూర్వకంగా పిర్యాదు మేరకు.. రాష్ట్ర క్వాలిటీ కంట్రోల్ కోఆర్డినేటర్‌లు వరప్రసాద్, శ్రీనుసరావు గురువారం రోడ్డు పనులను పరిశీలించారు. ఏప్రిల్ నెల 2న జిల్లా ఉపాధి హామీ ప్రోజెక్టు డైరెక్టర్ దర్యాప్తు అనంతరం సిఎంఓ, జిల్లా కలెక్టర్, పిఒల ఆదేశాల మేరకు సమగ్ర విచారణ చేపడుతున్నామని అధికారులు తెలిపారు. ఫారెస్ట్ శాఖ అనుమతులకు అధికారుల దృష్టికి తీసుకెళ్తామని, నివేదిక అందజేస్తామని అధికారులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంబదీత అదికారులు గ్రామస్తులు పాల్గొన్నారు.

బిజెపి, టిడిపి, వైసిపిలను తరిమికొట్టండి

సిపిఎం, ఇండియా వేదిక అభ్యర్థులను గెలిపించండి
కూనవరం బహిరంగ సభలో సిపిఎం జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి సహా పలువురు వక్తలు పిలుపు

బహిరంగ సభలో అభివాదం చేస్తున్న సీతారాం ఏచూరి, చత్తీస్‌ఘడ్ కాంగ్రెస్ ఎమ్మెల్యే లక్మా, తెలంగాణ సిపిఐ ఎమ్మెల్యే సాంబశివరావు, అభ్యర్థులు లోతా రామారావు, పి.అప్పలనర్స, సిపిఎం, సిపిఐ, కాంగ్రెస్ ఎపి, తెలంగాణ రాష్ట్రాల నాయకులు

ప్రజాశక్తి - రాజమండ్రి ప్రతినిధి, కూనవరం విలేకరి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి తీవ్ర ద్రోహం చేసిన బిజెపిని, దానితో పొత్తు పెట్టుకున్న తెలుగుదేశం పార్టీని, ఐదేళ్లుగా అంటకాగిన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీని తరిమికొట్టాలని సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరితో సహా పలువురు వక్తలు పిలుపునిచ్చారు. సిపిఎం అరకు ఎంపీ అభ్యర్థి పాచిపెంట అప్పలనర్స, రంపచోడవరం ఎమ్మెల్యే అభ్యర్థి లోతా రామారావు సహా అరకు పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఇండియా ఫోరం అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ అల్లూరి జిల్లా కూనవరం మండల పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న గ్రౌండ్‌లో గురువారం భారీ బహిరంగ సభ నిర్వహించారు. భారీ బైక్ ర్యాలీ, ఆదివాసీలు సంప్రదాయ నృత్య ప్రదర్శనలతో అతిథులకు ఆత్మీయ స్వాగతం పలికారు. అనంతరం సిపిఎం ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్ అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో సీతారాం ఏచూరి మాట్లాడుతూ గడిచిన పది సంవత్సరాలలో రాజ్యాంగ పునాది స్తంభాలపై మోడీ ప్రభుత్వం దాడికి తెగబడిందని మండిపడ్డారు. ప్రత్యామ్నాయ లౌకిక ప్రభుత్వం అధికారంలోకి వస్తేనే భారత దేశానికి అమృత కాలం వస్తుందని చెప్పారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం కుంట నియోజకవర్గం కాంగ్రెస్ ఎమ్మెల్యే లక్మా మాట్లాడుతూ ఆదివాసీ చట్టాలకు మోడీ ప్రభుత్వం తూట్లు పొడుస్తోందన్నారు. సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ విలీన మండలాల్లో ప్రజా సమస్యలపై సమరశీల పోరాటాలు నిర్వహించిన చరిత్ర కమ్యూనిస్టుల సొంతమని చెప్పారు.

సిపిఎం ఎపి రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ మోడీ తన ఎపి పర్యటనల్లో అమరావతిలో రాజధాని గురించి గానీ, కడపలో ఉక్కు ఫ్యాక్టరీ గురించి గానీ కనీసం నోరు మెదపలేదన్నారు. రాష్ట్రానికి వెన్నుపోటు పొడిచిన మోడీతో జతకట్టి చంద్రబాబు, జగన్ పార్టీలు ఏం ఉద్ధరిస్తాయని ప్రశ్నించారు. పోలవరం నిర్మాణంపై పోటాపోటీగా ప్రకటనలు గుప్పిస్తున్న చంద్రబాబు జగన్మోహన్ రెడ్డి పార్టీలు పోలవరం నిర్వాసితుల గురించి కనీసం స్పందించిన దాఖలాలు లేవన్నారు. నిర్వాసితులకు పునరావాస నిధులు, పొలానికి పొలం, ఇంటికి ఇల్లు ఎర్రజెండాతోనే సాధ్యమని చెప్పారు. అరకు పార్లమెంటు పరిధిలోని అన్ని నియోజకవర్గాల్లో ఇండియా వేదిక అభ్యర్థులను గెలిపించి రాష్ట్రానికి ఆదర్శంగా నిలవాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే అభ్యర్థి లోత రామారావు మాట్లాడుతూ రంపచోడవరం నియోజకవర్గం ప్రజలు తనను గెలిపిస్తే పోలవరం నిర్వాసితుల గళాన్ని అసెంబ్లీలో వినిపించి పోరాడి నిధులు తీసుకొస్తానని చెప్పారు. కమ్యూనిస్టులను విమర్శించే నైతిక అర్హత అనంత బాబుకు లేదన్నారు. గడిచిన 40 ఏళ్లలో అనంత బాబు, అతని తండ్రి అడ్డతీగలకు ఏం చేశారో చెప్పాలన్నారు. ఎంపీ అభ్యర్థి పి.అప్పలనర్స మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో వైసిపి అభ్యర్థులు గెలిచినప్పటికీ ఈ ప్రాంత ప్రజల సమస్యలపై ఏనాడూ నోరుమెదిపిన దాఖలాలు లేవన్నారు. సహజ వనరులను అదాని, అంబానీలకు దోచిపెట్టి ఏజెంట్లుగా మారిపోయారని విమర్శించారు. తునికాకు, ఉపాధి హామీ, ఆదివాసీ చట్టాల పరిరక్షణ, జీవో నెంబర్ 3, పోలవరం నిర్వాసితుల హక్కుల కోసం ప్రశ్నించి గొంతుకులైన సిపిఎం అభ్యర్థులను గెలిపించాలని కోరారు. సిపిఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పి.సుదర్శన్ మాట్లాడుతూ పోలవరం నిర్వాసితుల హక్కుల కోసం పోరాటాలు నిర్వహించిన ఏకక పార్టీ సిపిఎం మాత్రమేనని తెలిపారు. ఎమ్మెల్సీ ఐవి మాట్లాడుతూ పిడిఎఫ్ ఎమ్మెల్సీలుగా శాసనమండలిలో అనేకసార్లు పోలవరం నిర్వాసితుల సమస్యలపై పాలక పక్షాన్ని ప్రశ్నించామని, ఇక్కడ ఓట్లతో గెలిసిన ఎమ్మెల్సీ అనంత బాబు, ఎమ్మెల్యే ధనలక్ష్మి ప్రశ్నించిన దాఖలాలు లేవని చెప్పారు. అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ మాట్లాడుతూ విలీన మండలాల్లో జెండాలు ఏవైనా అజెండా ఒకటే కావాలన్నారు. బహిరంగ సభకు హాజరైన వారందరూ ఇతర పార్టీల కార్యకర్తలతో సైతం చర్చించి సిపిఎం అభ్యర్థులను గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరావు, మంతెన సీతారాం, వి.వెంకటేశ్వర్లు, సిపిఐ నాయకులు రావులపల్లి రవి, కల్లూరు వెంకటేశ్వర్లు, తెలంగాణ కాంగ్రెస్ నాయకులు ఎస్ అస్మతుల్లా, సిపిఎం భద్రాది కార్యదర్శి ఏ.కనకయ్య, బండారు రవికుమార్, వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ సుకుమా నాయకులు బి.రాజు, ఉంగా, ప్రజానాట్యమండలి అధ్యక్షులు మంగరాజు, సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు అరుణ్, సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఏవి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కళాకారులతో కలిసి నృత్యం చేస్తున్న సీతారాం ఏచూరి, అభ్యర్థులు లోతా రామారావు, పి.అప్పలనర్స తదితరులు

ఎరుపెక్కిన కూనవరం

- ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు

ప్రజాశక్తి - కూనవరం, విఆర్.పురం, చింతూరు

సిపిఎం, ఇండియా ఫోరం ఆధ్వర్యంలో గురువారం కూనవరంలో నిర్వహించిన భారీ బహిరంగ సభ విజయవంతమైంది. టేకులబోరులోని పోలీస్ స్టేషన్ గ్రౌండ్ జనంతో కిటకిటలాడింది. ఎర్ర జెండాలు చేతబట్టి భారీ ప్రదర్శన నిర్వహించడంతో కూనవరం ఎరుపెక్కింది. ఎమ్మెల్యే అభ్యర్థి లోత రామారావు విఆర్.పురం మండలం రేకపల్లి సెంటర్ నుంచి, అరకు ఎంపీ అభ్యర్థి పాచిపెంట అప్పలనర్స భీమవరం క్రాస్ రోడ్ నుంచి భారీ ప్రదర్శనలతో సభస్థలికి చేరుకున్నారు. విలీన మండలాల ప్రజలు వేలాదిమంది తరలిరావడంతో కూనవరం రహదారులు కిక్కిరిశాయి. సభాస్థలిలో ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో ఆలపించిన గీతాలు, నిర్వహించిన నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఎర్రజెండా ప్రత్యేకతను వివరించడంతోపాటు దేశంలో, రాష్ట్రంలో తాజా రాజకీయ పరిస్థితులను, నాయకుల విధానాలను ప్రదర్శనలో ప్రస్ఫుటించారు. ప్రజా నాట్యమండలి రాష్ట్ర అధ్యక్షులు మంగరాజు, ఐవి నేతృత్వం సుమారు 70 మంది కళాకారులు ఈ నృత్య ప్రదర్శనలో భాగస్వాములయ్యారు. పిఎన్ఎం ప్రదర్శనలు ప్రజలను ఆలోచింపజేశాయి. ఆదివాసీలు సంప్రదాయ రేలా రేలా నృత్య ప్రదర్శనలు నిర్వహించగా, వారితో సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, అభ్యర్థులు కదం తొక్కారు. ఈ కార్యక్రమంలో విఆర్.పురం ఎంపీపీ కారం లక్ష్మి, కూనవరం వైస్ ఎంపిపి కొమరం పెంటయ్య, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు మేకల నాగేశ్వరరావు, పూనెం సత్యనారాయణ, పల్లపు వెంకట్, మండల కార్యదర్శులు పాయం సీతారామయ్య, సోయం చిన్నబాబు, నాయకులు యు.శ్రీనివాసరావు, కాంగ్రెస్ నాయకులు శ్రీమంతుల వెంకటరమణ, లీలా కృష్ణ, సిపిఐ నాయకులు గుజ్జా మోహన్‌రావు, కర్నాటి ఏసు రాంబాబు శివగిరి కామేశ్వరరావు, ఇండియా వేదిక నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

కళారూపాలు ప్రదర్శిస్తున్న ప్రజా నాట్యమండలి కళాకారులు

మాట్లాడుతున్న దళిత సంఘాల నాయకులు

దళిత, గిరిజన ద్రోహులను ఓడించండి

- వామపక్ష అభ్యర్థులను గెలిపించండి
- దళిత సంఘాల పిలుపు

ప్రజాశక్తి- అల్లూరి సీతారామరాజు జిల్లా

దళితుల పేరు చెప్పి అధికారంలోకి వచ్చి, రాష్ట్రంలో దళితులకు సంబంధించిన 27 పథకాలను రద్దు చేసిన వైసిపిని, భారత రాజ్యాంగాన్ని మారుస్తామంటున్న బిజెపిని ఓడించాలని, వామపక్ష అభ్యర్థులను గెలిపించాలని దళిత సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. సీనియర్ దళిత నాయకులు అయితాబత్తుల రామేశ్వరరావు, రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర నాయకులు పిట్ట వరప్రసాద్, కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం కాకినాడ జిల్లా కార్యదర్శి కూరాకుల సింహాచలం తదితరులు గురువారం అల్లూరి సీతారామరాజు జిల్లా అడ్డతీగల మండల కేంద్రంలో విలేకర్లతో మాట్లాడారు. వైసిపి ఐదేళ్ల పాలన కాలంలో దళితులపై దాడులు పెరిగాయని, స్వయంగా వైసిపి ఎమ్మెల్సీ అనంత ఉదయ భాస్కర్ తన కారు డ్రైవర్ అయిన సుబ్రహ్మణ్యంను హత్య చేసి డోర్ డెలివరీ చేశారని గుర్తు చేశారు. అటువంటి అనంత ఉదయభాస్కర్ ఎమ్మెల్సీ పదవిని రద్దు చేయలేదన్నారు. అలాగే మరో వైసిపి ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు దళితులకు శిరోముండనం చేసిన కేసులో కోర్టు అతనికి శిక్ష వేసినా, ఆయనకు మండపేట ఎమ్మెల్యేగా టికెట్ ఇచ్చిన వైసిపి దళితుల ద్రోహి పార్టీగా నిరూపించుకుందని తెలిపారు. ఏజెన్సీ గిరిజనులకు రక్షణగా ఉన్న అనేక చట్టాలను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మార్పు చేస్తూ ఆదివాసీల మనుగడనే ప్రశ్నార్థకం చేస్తుందన్నారు. గిరిజనులకు ఉద్యోగ అవకాశాలు లేకుండా చేస్తున్న వైసీపీ ప్రభుత్వాన్ని, ఏజెన్సీని, గిరిజనులను కొల్లగొడుతున్న ఎమ్మెల్సీ అనంత ఉదయభాస్కర్ మద్దతిస్తున్న వైసీపీ అభ్యర్థిని, ఆదివాసీలకు ద్రోహం చేస్తున్న బిజెపి ఎంపీ అభ్యర్థిని ఓడించాలని పిలుపునిచ్చారు. ప్రజల కోసం నిరంతరం పోరాటాలు చేస్తున్న సిపిఎం రంపచోడవరం ఎమ్మెల్యే అభ్యర్థి లోతా రామారావు, అరకు ఎంపీ అభ్యర్థి పాచిపెంట అప్పలనర్సలను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

మారుమూల గిరిజన గ్రామాల
ఓటర్ల కోసం వాహనాలు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-సీలేరు : మారుమూల గిరిజన గ్రామాల్లో ఉన్న ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోవడానికి వీలుగా వాహన సదుపాయాలు ఏర్పాటు చేయాలని జిల్లా ఉన్నతాధికారులకు గాలికొండ ఎంపిటిసి సభ్యులు అంపరంగి బుజ్జిబాబు విజ్ఞప్తి చేశారు. గురువారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ జీకే వీధి మండలంలోని పలు మారుమూల గ్రామాలకు పోలింగ్ బూత్‌లు దూర ప్రాంతాల్లో ఏర్పాటు చేశారని తెలిపారు. దారకొండ పంచాయితీ పరిధిలోని తడకపల్లి, పెబ్బేంపల్లి, గొల్లపల్లి గ్రామాలకు సప్పర్లలో పోలింగ్ బూత్ ఏర్పాటు చేశారని, ఆ గ్రామాల ఓటర్లు ఓటు వేయడానికి 25 నుంచి 30 కిలోమీటర్లు రావాల్సి ఉందని చెప్పారు. గుమ్మిరేవుల పంచాయతీ పరిధి గ్రామాల్లో ఉన్న ప్రజలు ఓటు హక్కును వినియోగించుకోవాలంటే సుమారు 5 నుంచి 10 కిలోమీటర్ల దూరంలో ఉన్న పోలింగ్ బూత్‌కి వెళ్ళవలసిన పరిస్థితి ఉందన్నారు. అసలే ఎండలు మండిపోతున్నాయని, అధిక ఉష్ణోగ్రతలు, వడగాల్పుల వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని, ఇటువంటి పరిస్థితుల్లో పదుల కిటోమీటర్లు నడిచి వచ్చి ఓటు హక్కు వినియోగించుకునే పరిస్థితి ఉండదని పేర్కొన్నారు. ప్రధానంగా వృద్ధులు, వికలాంగులు పోలింగ్ బూతులకు వెళ్లలేక తమ ఓటును వేయలేని నిస్సహాయ స్థితి నెలకొంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా అధికార యంత్రాంగం స్పందించి మారుమూల గ్రామాల్లో ఉన్న ఓటర్లు ఓటు హక్కులు వినియోగించుకోవడానికి వీలుగా వాహనాలు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు గన్నెల పరమేశ్వరరావు, కాంగ్రెస్ ఎస్‌టి సెల్ జిల్లా చైర్మన్ కోన ఎల్లారావు పాల్గొన్నారు.

మండు వేసవిలో మంచు దుప్పటి

- మన్యంలో విభిన్న వాతావరణం

(ప్రజాశక్తి పాడేరు): మన్యం మంచు దుప్పటి కప్పుకుంది. అల్లూరి జిల్లా కేంద్రం పాడేరు పట్టణం చుట్టూ పరిసర గ్రామాల్లో గురువారం వేకువ జామున తెల్లారేసరికి శీతాకాలాన్ని తలపించే రీతిలో దట్టంగా పొగ మంచు కమ్మేసింది. శీతల గాలులు ఆహ్లాదపరిచాయి. పాడేరు ఏజెన్సీలో మే నెల ఆరంభం నుంచి భిన్న వాతావరణ పరిస్థితులు నెలకొన్నాయి. మండుటెండలతో పాటు భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఉదయాన్నే చుర్రు మనిపించే ఎండ మధ్యాహ్నం మూడు గంటల వరకు తీక్షణంగా ఉంటున్నాయి. ఎండ తీవ్రతకు రోజు ఇటీవల 33 నుంచి 39 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. కాగా ఈ తీవ్రమైన మండుటెండల్లో కూడా పాడేరు మన్యంలో రోజు పలుచోట్ల ఉరుములతో కూడిన భారీ వర్షాలు కురుస్తున్నాయి. పలు మండలాల్లో కురుస్తున్న వానలు 30 మిల్లీమీటర్ల వరకు నమోదు అవుతున్నాయి. సాయంత్రం పూట పడే వానలు రాత్రిపూట కురిసే మంచు తో మన్యంలో నెలకొన్న ఈ భిన్న వాతావరణం, మన్యవాసులను ఆహ్లాదపరుస్తూ మండుటెండలనుంచి మై మరిపిస్తోంది.

ఆకాశంలో విహరిస్తూ అలసి సొలసి పాడేరు సమీపంలోని పర్వతాల కిందకు నేలకు ఒదిగి సేద తీరుతూ విశ్రమిస్తున్న " పాసింగ్ క్లౌడ్స్" ఇప్పటికే రాష్ట్రం నలుమూలల ప్రజలను ఆకర్షించి ఆకట్టుకుంటున్నాయి. గత రెండేళ్లుగా ఈ ప్రాంతం "వంజంగి హిల్స్" పేరుతో పర్యాటక కేంద్రంగా మారింది. ఇక్కడకు వచ్చే పర్యాటకులు భువికి దిగిన కైలాసగిరిగా ఈ ప్రాంతాన్ని అభివర్ణిస్తున్నారు. పాడేరు ఏజెన్సీ వ్యాప్తంగా వేలాది ఎకరాల్లో విస్తరించిన కాఫీ తోటలుతో వీటికి నీడనిచ్చే తోటలు విస్తరణతో ఈ ప్రాంతమంతా ఏడాది పొడుగునా మూడు కాలాలను రోజు చవిచూసే ఒక శీతల కేంద్రంగా భిన్న వాతావరణానికి నెలవుగా మారింది.

పాడేరులో కురుస్తున్న పొగమంచు

గోతులు పడిన రహదారి

రహదారి గోతులమయం

-అవస్థలు పడుతున్న వాహనదారులు

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు: మండలంలో రహదారులు గోతులమయం కావడంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. పాడేరు నుండి జోలపుట్టు వెళ్లే ఆర్ అండ్ బి ప్రధాన రహదారి ముంచింగిపుట్టు మండలం ఏనుగురాయి పంచాయతీ చోటముక్కి పుట్ ప్రధాన అస్తవ్యస్తంగా ఉంది. ఈ రహదారిలో నిర్మించిన కల్వర్టు వద్ద గుంతలు ఏర్పడి అస్తవ్యస్తంగా ఏర్పడి ప్రమాదాలకు దారి తీస్తోంది. పలుమార్లు ప్రమాదాలు జరిగి పలువురు తీవ్రగాయాలు పాలైన ఘటనలు ఉన్నాయి. భారీ గుంతలు ఏర్పడి ఉండటంతో వరద నీరు చేరి ఎక్కడ గుంతలు ఉన్నాయో తెలియక ద్విచక్ర వాహన చోదకులు బోల్తా పడి ఆసుపత్రి పాలవుతున్నారు. అధికారులు స్పందించి కల్వర్టు వద్ద గుంతలు పూడ్చి ప్రమాదాలు జరగకుండా చూడాలని వాహన చోదకులు, ప్రయాణికులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

కూటమి నేతల ప్రచారం

ప్రజాశక్తి -అనంతగిరి: మండలంలో టిడిపి, జనసేన నేతలు ప్రచారం చేపట్టారు. మండలంలోని డముకు, కాశీపట్నం వారపు సంతలో దింసా నృత్యంతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు.

ఆసుపత్రిలో సౌకర్యాలు కల్పించాలి

ప్రజాశక్తి-పెదబయలు : గోమంగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మౌలిక సదుపాయాలు కల్పించాలని పౌర హక్కుల, అత్యాచారాల నిరోధక చట్టం జిల్లా కమిటీ సభ్యుడు చెండా లోహితాసుడు డిమాండ్ చేసారు. మండలంలో గోమంగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం సందర్శించారు. సెక్యూరిటీ సిబ్బందిని నియమించాలని, రోగులకు అనుకూలంగా ఇరవై నాలుగు గంటల. వైద్య సేవలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో అల్లూరి జిల్లా వినియోగదారుల సంఘం వైస్ ప్రెసిడెంట్ కూడా కృష్ణబాబు పాల్గొన్నారు.

పెదబయలులో భారీ వర్షం

ప్రజాశక్తి-పెదబయలు : మండల జేంద్రంలో గురువారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది మధ్యాహ్నం వరకూ ఎండ కాసింది. స్థానికులు ఇళ్ల నుండి బయటకు రాని పరిస్థితి నెలకొంది. మధ్యాహ్నం 3.30 గంటలకు ఈదురు గాలులుతో పాటు వాడగాళ్ళతో కూడిన వర్షం కురిసింది. దీంతో స్థానికులు ఊపిరి పీల్చుకొన్నారు.

FORMAT C-1
(for Candidate to Publish in Newspapers, TV)
DECLARATION ABOUT CRIMINAL CASES
(As per the Judgement Dated 25th September Court in WP (Civil) No. 536 of 2011
(Public Interest & Ors. Vs. Union of India)

Name and address of Candidate : **APPALANARASA PACHIPENTA**
S/o.(Late) APPALASWAMY, Aged 41years,
BONDAM Village, PANCHAYATH Post,
ARAKUVALLEY Mandal, Pin code:531149
and Resident of GUDIVADA, PADERU Mandal,
ALLURI SITHARAMRAJU
Dist., Andhra Pradesh State 531024
Name of the Political Party : **COMMUNIST PARTY OF INDIA (MARXIST) CPI(M)**
Name of Election : **PARLIAMENTARY CONSTITUENCY**
Name of Constituency : **01-ARAKU (ST)**

I APPALANARASA PACHIPENTA S/o.(Late) APPALASWAMY, Aged 41years, **BONDAM** village, **PANCHAYATH** and Post, **ARAKUVALLEY** Mandal, Pin code:531149 and Resident of **GUDIVADA**, **PADERU** Mandal, **ALLURI SITHARAMRAJU** Dist., Andhra Pradesh State 531024 a candidate for the above mentioned election, declare for public information the following details about my Criminal antecedents:

Sl. No	Pending Criminal Cases			Details about cases of Conviction for criminal offences	
	Name of Court	Case No and status of case	Section(s) of Acts concerned and brief description of offence(s)	Nameof Court & date (s) of order(s)	Description of offence(s) & punishment imposed
1.	JFCM Court Paderu	FIR No. Cr. No.03/2022 of Pederu Police Station, and case no. 168/2022 of JFCM Court Pederu	U/s.186,269, 270,283,34, 341,353 IPC, 3-EDA,51(b) -DMA-2005 Participate In Dharna & Rally	Not Applicable	Not Applicable
2.	JFCM Court Paderu	FIR No. Cr. No.186/2021 of Pederu Police Station	U/s.143, 145,149, 186,341, 353 IPC, 3-EDA, 51(4)-DMA-2005 Participate In Dharna & Rally	Not Applicable	Not Applicable
3.	JFCM Court Paderu	FIR No. Cr. No.162/2021 of Pederu Police Station	U/s.188, 34. 341, 447 IPC 3 EDA,51(b)- DMA-2005 Participate In Dharna & Rally	Not Applicable	Not Applicable

**In the case of election to Council of States mention the Election Concerned in place of Name of Constituency.*

APPALANARASA PACHIPENTA S/o.(Late) APPALASWAMY,
01-ARAKU (ST) PARLIAMENTARY CONSTITUENCY CANDIDATE

సిపిఎం అభ్యర్థులను గెలిపించాలని ముమ్మర ప్రచారం

వై.రామవరం మండలంలో ప్రచారం చేస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-యంత్రాంగం

రాజవొమ్మంగి : ఇండియా వేదిక బలపర్చిన సిపిఎం రంపచోడవరం ఎమ్మెల్యే అభ్యర్థి లోతా రామారావు, అరకు ఎంపీ అభ్యర్థి పాచిపెంట అప్పలనర్సలను గెలిపించాలని కోరుతూ మండలంలోని పలు పంచాయతీలలో సిపిఎం నాయకులు ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. పలు గ్రామాల్లో సమావేశాలు పెట్టి, ఇంటింటా ప్రచారం నిర్వహించారు. సుత్తి కొడవలి నక్షత్రం గుర్తుపై ఓటు వేసి సిపిఎం అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా సిపిఎం మండల నాయకులు కళ్ళ రాజబాబు, పాండవుల సత్యనారాయణ, మేలిన రమేష్, కాండ్ర సూరిబాబు, కొంచెం జగన్నాథం తదితరులు మాట్లాడుతూ పేదలు, గిరిజనులు, కార్మికుల సమస్యలపై గళమెత్తాలంటే సిపిఎం అభ్యర్థులను అసెంబ్లీ, పార్లమెంట్‌కు పంపించాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు గంగరాజు, ప్రవీణ్, సత్తిబాబు, రామరాజు, దొరబాబు, మంగరాజు, లక్ష్మణరావు, టి శ్రీను, పి వీరబాబు, కె జగన్నాథం పలువురు యువకులు, మహిళలు పాల్గొన్నారు.

వై.రామవరం : మండలంలోని చెవిటి దిబ్బలు గ్రామంలో ఉపాధి పనులు చేస్తున్న కూలీల దగ్గరకు, జీడిపిక్కలు కోస్తున్న వారికి దగ్గరకు సిపిఎం నాయకులు గురువారం వెళ్లి సిపిఎం అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు శాంతిరాజు, రామకృష్ణ మాట్లాడుతూ ఆదివాసీల హక్కుల రక్షణ కోసం, గ్రామాలలో మౌలిక వసతుల కోసం సిపిఎం పోరాడుతుందని చెప్పారు. ప్రజలకు అందుబాటులో ఉండే సిపిఎం అభ్యర్థులను ఎన్నుకుంటే ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఆంజనేయులు, దుర్గ వెంకటేశ్వర్లు, ప్రసాద్, సత్యనారాయణ, నాగేంద్ర పాల్గొన్నారు.

సీలేరు : సిపిఎం అరకు ఎంపీ అభ్యర్థి పాచిపెంట అప్పలనర్సను గెలిపించాలని కోరుతూ జికె.వీధి మండలంలోని మారుమూల గ్రామాల్లో గురువారం సిపిఎం నాయకులు ప్రచారం నిర్వహించారు. సుత్తి కొడవలి నక్షత్రం గుర్తుపై ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో గాలికొండ ఎంపిటిసి సభ్యులు అంపరంగి బుజ్జిబాబు, సిపిఎం మండల నాయకులు గన్నెల పరమేశ్వరరావు, కాంగ్రెస్ ఎస్‌టి సెల్ జిల్లా చైర్మన్ కోన ఎల్లారావు పాల్గొన్నారు.

డుంబ్రిగుడ: ఇండియా కూటమి బలపరిచిన సిపిఎం అరకు పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి పాచిపెంట అప్పలనర్సను ఓటు వేసి గెలిపించాలని కోరుతూ మండలంలోని పోతంగి పంచాయతీ గ్రామాల్లో ఆ పార్టీ నాయకులు సోమవారం ప్రచారం నిర్వహించారు. పోతంగి పంచాయితీ బోడిగూడ, తోటవలస, పోతంగి, రంగినివలస, పూటీవలస, చెలిమరవలస గ్రామాల్లో సిపిఎం మండల నాయకులు బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి ఎస్‌బి పోతురాజు మాట్లాడుతూ, గిరిజన హక్కులు, చట్టాలు రక్షణకు వామపక్షాల అభ్యర్థులు చట్టసభల్లో ఉండాలన్నారు. అప్పలనర్సకు ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు పి.సురేష్ కుమార్, టి.సూర్యనారాయణ, ఎస్ గురుమిసింగ్ తదితరులు పాల్గొన్నారు.

ముంచింగిపుట్టు: మండలంలోని బరడ పంచాయతీ బొర్రపుట్టు, హంసబంద, గొల్లిపుట్టు, సోలగంపుట్టు, వంద్రంగుల, అంటబొంగు గ్రామాలలో ఇండియా ఫోరం బలపరిచి అభ్యర్థులను గెలిపించాలని ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం సీనియర్ నాయకులు ఎస్.గాసిరందొర, ఎం.నర్సింగ్‌పడల్ మాట్లాడుతూ, ఆదివాసీల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతున్న సిపిఎం ఎంపీ అభ్యర్థి అప్పల నర్సకు ఓటు వేయాలని కోరారు. బీజేపీతో పొత్తు పెట్టుకున్న టీడీపీ, జనసేన, తొత్తుగా మారిన వైసిపి పార్టీలను ఓడించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఎంఎం శ్రీను, కొర్ర త్రినాధ్, శంకర్రావు పాల్గొన్నారు.

జి.మాడుగుల: మండలంలోని గెమ్మెలి, గడుతురు, సోలభం పంచాయతీ రాళ్లపుట్టు, చిన్నపిన్నపాలెం, పెద్దలోచలి, వంతల గ్రామాలలో సిపిఎం నాయకులు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివాసి గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు సాగిన ధర్మన్న పడాల్, మండల అధ్యక్షులు వనుగు సన్యాసిదొర మాట్లాడుతూ, ఇండియా ఫోరం అభ్యర్థులను గెలిపిస్తే జీవో 3 పునరుద్ధరణ, గిరిజన ప్రాంతాల్లో 100శాతం ఉద్యోగాలు గిరిజనులకే కేటాయించడానికి, కనీస వేతనాల అమలు, మాతృభాష విద్యా వాలంటీర్లకు ఉద్యోగ భద్రత తదితర సమస్యలపై పోరాటం చేస్తారన్నారు. ఈ ప్రచారంలో ఆదివాసి గిరిజన సంఘం నాయకులు వనగాల సత్తిబాబు, సిపిఎం నాయకులు వంజరి పిన్నమనాయుడు, పలాసి సంక్షయ్య, పలాసి మత్స్యం నాయుడు, కొర్ర జయకుమార్, కాంగ్రెస్ నాయకులు మాతే సన్యాసి దొర, సారే సన్యాసి దొర పాల్గొన్నారు.

పెదబయలు: మండలంలోని సిపిఎం నేతలు ప్రచారం చేశారు. మండలంలోని గంపరాయి, పెద్దకోడపల్లి పంచాయతీల్లో ముమ్మరంగా ప్రచారం చేసి సిపిఎం గెలుపు ఆవశ్యకతను తెలియజేశారు.సిపిఎం నాయకులు బొండ సన్నిబాబు, వివి శ్రీనివాసరావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు గంగాధర్, సునీల్, శరబన్న, బుజ్జిబాబు, కాంగ్రెస్ నాయకులు చెండా సన్యాసిరావు పాల్గొన్నారు.

డుంబ్రిగుడ మండలంలో ప్రచారం చేస్తున్న సిపిఎం నాయకులు

ప్రశాంతంగా పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్

ప్రజాశక్తి-పాడేరు: జిల్లాలో పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ విజయవంతమైంది. అరకు అసెంబ్లీ నియోజకవర్గంలో ఆరు రోజులు పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియ నిర్వహించారు. ఆరవ రోజు స్థానిక కంబైన్స్ గుడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌లో గురువారం 171 మంది ఉద్యోగులు సద్వినియోగం చేసుకున్నారని అరకు అసెంబ్లీ రిటర్నింగ్ అధికారి, ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి వి.అభిషేక్ తెలిపారు. అరకు అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన 151 మంది, పాడేరు అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన 15 మంది, ఇతర జిల్లాలకు చెందిన ఉద్యోగులు 11 మంది ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారని చెప్పారు. మొత్తం 3,868 మంది దరఖాస్తు చేశారని, 3017 మంది ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ లో పాల్గొన్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఏ సహాయ ప్రాజెక్టు అధికారి ఎం.వెంకటేశ్వరరావు, ఐటీడీఏ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకున్నారని పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ కేంద్రాల ఇంచార్జ్, మారేడుమిల్లి తహశీల్దార్ వివి రమణ పేర్కొన్నారు. గురువారం 117 మంది పోస్టల్ బ్యాలెట్లు వినియోగించుకున్నారని తెలిపారు. 4408 మంది పోస్టల్ బ్యాలెట్లకు దరఖాస్తులు సమర్పించగా ఈనెల 4 నుండి ఈ నెల తొమ్మిది వరకు మొత్తం 3742 మంది వినియోగించుకున్నారని తెలిపారు. ఇందులో రంపచోడవరం నియోజకవర్గానికి సంబంధించి 3274 మంది, పాడేరు నియోజకవర్గానికి సంబంధించి 13 మంది, అరకు నియోజకవర్గానికి సంబంధించి ఒకరు, ఇతర జిల్లాలకు సంబంధించి 454 మంది పోస్టల్ భ్యాలెట్లు వినియోగించుకున్నారని తహసిల్దార్ తెలిపారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసిల్దారులు బి.రాజు, స్వామి,బాలాజీ, రవీంద్రబాబు, సుధాకర్‌బాబు, సరిత, శ్రీధర్, విశ్వనాథ్, శివ, వీరభద్రరావు పాల్గొన్నారు.

వాహనాల ఏర్పాటుకు పిఒ హామీ

ప్రజాశక్తి- అనంతగిరి: ఈనెల 13న జరిగే సార్వత్రిక ఎన్నికలలో భాగంగా మారుమూల గ్రామాల నుండి పోలింగ్ బూత్‌ల వరకు వాహనాలు ఏర్పాటు చేయాలని స్థానిక సిపిఎం జెడ్పీటీసీ దీసరి గంగరాజు గురువారం పాడేరు ఐటీడీఏ ప్రాజెక్టు, జిల్లా రిటర్నింగ్ అధికారి వి అబిషేక్‌కు ఫోనులో కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మండలంలోని పెద్దకోట, పినకోట, జీనబాడు, రొంపల్లి పంచాయతీ పరిధిలోని కొండ శివారున గ్రామాలు ఉన్నాయని, పోలింగ్ బూత్‌లకు వెళ్లాలంటే కాలినడకన 40 కిలోమీటర్ల పైగా వెళ్ళవలసి వస్తుందని తెలిపారు. రాను పోను వాహనాలు ఏర్పాటు చేయాలని జెడ్‌పిటిసి కోరారు. మండలంలో ఏడు వాహనాలు ఏర్పాటు చేస్తున్నామని పిఒ హామీ ఇచ్చారని ఆయన తెలిపారు.

గంటా ఎన్నికల ప్రచారం

ప్రజాశక్తి -యంత్రాంగం

భీమునిపట్నం : మండలంలోని లక్ష్మీపురం, సింగనబంద, నారాయణరాజు పేట గ్రామాల్లో టిడిపి భీమిలి ఎమ్మెల్యే అభ్యర్థి గంటా శ్రీనివాసరావు గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. భారీ గజమాలతో టిడిపి నాయకులు, కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా గంటా శ్రీనివాసరావు మాట్లాడుతూ, 2014-19 మధ్య కాలంలో తాను మంత్రిగా పనిచేసినప్పుడు చేసిన అభివృద్ధి నేటికీ కళ్ల ముందు కనబడుతోందన్నారు. ఈ నెల 13న జరుగు ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యేగా తనను, విశాఖ ఎంపీగా ఎం.శ్రీభరత్‌ను గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నియోజక వర్గ ఇంఛార్జి కోరాడ రాజబాబు, డిఎల్‌డిఎ చైర్మన్ గాడు వెంకటప్పడు, పార్టీ మండల అధ్యక్షులు డిఎఎన్.రాజు, నాయకులు గాడు తాతి నాయుడు, ఎస్.అప్పారావు, బోని వెంకటరమణ, ఎం.పైడినాయుడు, కనకల వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ఆరో వార్డులో టిడిపి బైక్ ర్యాలీ

పిఎం పాలెం : సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా టిడిపి తెలుగు యువత ఉపాధ్యక్షులు గరే గురునాథ్ ఆధ్వర్యాన జివిఎంసి ఆరో వార్డు పరిధి పిఎం.పాలెం సమీపంలో గురువారం 300 మంది టిడిపి అభిమానులు బైక్ ర్యాలీ నిర్వహించారు. భీమిలి నియోజకవర్గం కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గంటా శ్రీనివాసరావు తనయుడు గంటా రవితేజ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో రెడ్డి సత్యనారాయణ, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

టిడిపిలో చేరిన వైసిపి శ్రేణులు

ఆనందపురం : ఆనందపురం మండలం వెల్లంకి సమీపంలోని బొడ్డపాలెం గ్రామానికి చెందిన వైసిపి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున టిడిపిలో చేరారు. ఎంవిపి కాలనీలోని నివాసంలో వారికి కూటమి అభ్యర్థి గంటా శ్రీనివాసరావు పసుపు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీని గెలిపించడానికి శక్తి వంచన లేకుండా కృషి చేయాలని కోరారు. పార్టీలో చేరిన వారిలో సాడి నరేష్, సాడి అప్పారావు, చుక్క రమణ, వై.మోహన్, తొణంగి రామారావు, డి రవికుమార్, ఎం.తిరుపతిరావు, నర్సింగ్, రాము, రవితేజ తదితరులున్నారు.

చందనోత్సవ ఏర్పాట్ల పరిశీలన

వివిధ విభాగాల అధికారుల సమక్షంలో డ్రై రన్

చందనోత్సవ ఏర్పాట్లను పరిశీలిస్తున్న విశాఖ కలెక్టర్ మల్లికార్జున తదితరులు

ప్రజాశక్తి-విశాఖపట్టణం : సింహాచలం శ్రీ వరహ లక్ష్మీనరసింహ స్వామి చందనోత్సవ ఏర్పాట్లను విశాఖ జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున గురువారం సాయంత్రం పరిశీలించారు. పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్, జాయింట్ కలెక్టర్ కె.మయూర్‌అశోక్, జివిఎంసి కమిషనర్ సిఎం సాయికాంత్ వర్మ, సింహాచలం ఈవో శ్రీనివాసమూర్తి, ఇతర అధికారులతో కలిసి చందనోత్సవ ఏర్పాట్లను కలెక్టర్ పరిశీలించారు. ఏర్పాట్లను సమీక్షించే నిమిత్తం డ్రై రన్ నిర్వహించిన అధికారులు అక్కడ పరిస్థితులను ప్రత్యక్షంగా గమనించారు. చందనోత్సవం రోజున ఏయే శాఖల అధికారుల ఎలాంటి చర్యలు తీసుకోవాలని అనే అంశాలపై పూర్తి స్థాయిలో అవగాహన ఏర్పరచుకున్నారు.

ముందుగా కొండ దిగువున తొలి పావంచ వద్ద ఏర్పాట్లను పరిశీలించారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు ఇక్కడ వేచి ఉండేందుకు అనువుగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అక్కడ నుంచి మినీ బస్సు ద్వారా కొండపైకి అధికారులతో పాటు చేరుకున్న కలెక్టర్ అక్కడ జరుగుతున్న ఏర్పాట్లను చూశారు. క్యూ లైన్లను, బారికేడ్లను, షామియానాలను, తాగునీరు, మజ్జిగ వితరణ కేంద్రాలను పరిశీలించారు. బస్ స్టాప్ ప్రాంతంలో ఏర్పాటు చేస్తున్న క్యూలైన్ల వద్ద తీసుకోవాల్సిన చర్యలపై జివిఎంసి పోలీసు, దేవస్థానం అధికారులకు దిశానిర్దేశం చేశారు. టిక్కెట్లను జాగ్రత్తగా స్కాన్ చేసి భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. రూ.300, రూ.1000, రూ.1500 క్యూ లైన్లలో వచ్చే భక్తులకు సూచనలు చేయాలని, ఎవరు ఎలా వెళ్లాలి అనే అంశాలపై తగినన్ని సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని చెప్పారు. అనువంశిక ధర్మకర్త దర్శనాలు, తితిదే దేవస్థానం నుంచి పట్టు వస్త్రాలు సమర్పించే సమయంలో తీసుకోవాల్సిన చర్యలపై దేవాదాయ శాఖ అధికారులకు సూచనలు చేశారు. ఎండ వేడిమి నుంచి భక్తులు ఇబ్బంది పడకుండా ఎక్కడికక్కడ షామియానాలు ఏర్పాటు చేయాలని, షామియానాలు లేని చోట కింద కాళ్లు కాలకుండా వైట్ పెయింట్ వేయాలని ఆదేశించారు.

దర్శనాల కోసం వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా పబ్లిక్ అడ్రస్ సిస్టం ద్వారా అనౌన్స్ చేయించాలని, విరివిగా సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని చెప్పారు. క్యూ లైన్లలో, హోల్డింగ్ ప్రాంతాల్లో తాగునీరు సమకూర్చాలని, ఎక్కడికక్కడ వైద్య శిబిరాలు పెట్టాలని ఆదేశించారు. బయో టాయిలెట్లను తగినన్ని ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం ప్రధాన ద్వారం గూండా ఆలయంలోకి చేరుకున్న ఆయన అక్కడ పరిస్థితులను గమనించారు. రూ.1000, రూ.1500 టిక్కెట్ల భక్తులు ఆలయంలోకి చేరుకునే మార్గాలను పరిశీలించారు. నిజరూప దర్శనం నిమిత్తం వచ్చే భక్తులకు అసౌకర్యం కలగకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని ఈ సందర్భంగా కలెక్టర్ అధికారులకు సూచించారు. పోలీసు సిబ్బంది చేపట్టాల్సిన చర్యలపై పోలీస్ కమిషనర్ సంబంధిత అధికారులకు దిశానిర్దేశం చేశారు. ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నం కాకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. దేవాదాయ, పోలీసు, రెవెన్యూ, జివిఎంసి, వైద్యారోగ్య తదితర శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఓటేసి రండి...హెయిర్ కట్ ఫ్రీ!

విశాఖలో ఓ సెలూన్ షాపు యజమాని వినూత్న ఆఫర్

హెయిర్ కట్ చేస్తున్న రాధాకృష్ణ

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : భారత రాజ్యాంగం ప్రసాదించిన ఓటు హక్కును ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని, దేశ తలరాతను మార్చే ఈ ఓటు విలువను తెలియజేస్తూ కంచరపాలెం మెట్టు, ముత్యాలమ్మ ఆలయం ఎదురుగా ఉన్న ఓ సెలూన్ షాపు యజమాని వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఇక్కడి ఆర్కే స్మార్ట్ ది సెలూన్ అధినేత మల్లువలస రాధాకృష్ణ ఓటు వినియోగంపై ఓటర్లను చైతన్యం పరిచే క్రమంలో ఓటును సద్వినియోగం చేసుకున్న వారికి తన సెలూన్‌లో హెయిర్‌కట్ ఫ్రీ అంటూ ప్రకటించారు. దీనిపై మీడియాతో మాట్లాడుతూ, ఓటుకున్న ప్రాముఖ్యతను అందరికీ తెలియజేయాలనే ఉద్దేశంతోనే తానీ వినూత్న ఆఫర్‌ను ప్రకటించానన్నారు.ఈ నెల 13న సోమవారం ఓటేసి వచ్చిన వారికి ఉచితంగా హెయిర్ కట్ చేస్తామన్నారు. తమ సెలూన్ తరపున పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుంటానని, ఇది కూడా అందులో భాగమన్నారు.

మోడీకి కౌంట్‌డౌన్ ప్రారంభం

- టిడిపి, జనసేన, వైసిపి విధానాలు ఒక్కటే..
- ఆ పార్టీలన్నీ బిజెపి పల్లకీ మోసేవే..
- సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి.రాఘవులు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

దేశంలో మోడీ సర్కారుకు కౌంట్ డౌన్ ప్రారంభమైందని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి.రాఘవులు అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో బిజెపికి కొమ్ముకాస్తున్న టిడిపి, జనసేన, వైసిపిలకు విధానాల్లో ఏమాత్రమూ తేడా లేదని అన్నారు. గురువారం మధ్యాహ్నం విశాఖలోని గాజువాకలో ఓ హోటల్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో టిడిపి, వైసిపి మధ్య విధాన, రాజకీయ, సిద్ధాంతపరమైన వ్యత్యాసం ఏమీ లేదని, అందుకే బిజెపి పల్లకీని ఇరు పార్టీలు మోస్తున్నాయని అన్నారు. చంద్రబాబు బిజెపి చంకనెక్కితే జగన్ బిజెపి పంచన చేరాడని ఎద్దేవా చేశారు. విద్యుత్ సంస్కరణల బిల్లు, ఆస్తి పన్ను పెంపు, రైతుల మోటార్లకు మీటర్లు బిగించే విధానాలకు ఎపిలో జగన్ అంగీకరించడం దారుణమన్నారు. ఈ బిల్లులన్నింటికీ చంద్రబాబు నేతృత్వంలోని టిడిపి కూడా పార్లమెంట్‌లో ఆమోదం తెలిపిందన్నారు.

సిపిఎం, వామపక్షాలు, ఇండియా వేదిక కాంగ్రెస్ మాత్రమే వీటిని వ్యతిరేకిస్తున్నాయన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో రెండు పక్షాల మధ్యనే పోటీ నెలకొందని, బిజెపికి కొమ్ముకాసేవి, అంటకాగేవి ఒక పక్షంకాగా, ప్రజా ప్రయోజనాల కోసం ప్రత్యామ్నాయ విధానాలతో ముందుకెళ్తున్న ఇండియా వేదిక, సిపిఎం వామపక్షాలు మరో పక్షమని అన్నారు. దేశంలో ఎలక్ట్రోరల్ బాండ్స్ రూ.వేల కోట్లలో బిజెపికే అత్యధికంగా వెళ్లడం అందరికీ తెలిసిందేనన్నారు. సిపిఎం ఈ బాండ్ల విధానాన్ని వ్యతిరేకించిందని గుర్తుచేశారు. రాష్ట్రంలో టిడిపి, వైసిపిల్లో ఎవరికి ఓట్లేసినా ఒకటేనని, ఏ రాయితో కొట్టుకున్నా పళ్ల ఊడిపోవడం ఖాయమని ప్రజలకు హితవు పలికారు.

మాట్లాడుతున్న బివి.రాఘవులు, చిత్రంలో సత్యారెడ్డి, జగ్గునాయుడు, తదితరులు

ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌పై చంద్రబాబువి మోసపు మాటలు

ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌పై టిడిపి చెబుతున్న మాటల్లో వాస్తవం లేదని రాఘవులు అన్నారు. అయితే ఈ చట్టం దోపిడీ చేస్తుందన్నది నిజమేనన్నారు. విజన్-2020 పేరుతో గతంలో చంద్రబాబు దాదాపు ఇదే చట్టాన్ని తెచ్చారని, తాజా చట్టంలో అప్పిలేట్ అథారిటీ జ్యుడిషియల్‌కి కాకుండా రెవెన్యూకు పగ్గాలు ఇవ్వడాన్ని మాత్రమే ఆ పార్టీ తప్పుపడుతోందని తెలిపారు. చట్టాన్ని మొత్తంగా సమర్థించే పార్టీ టిడిపి అని విమర్శించారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం 1183 రోజులుగా కార్మికులు పోరాడుతుంటే సొంత గనులు ఇవ్వకుండా కేంద్రం అడ్డగోలుగా వ్యవహరిస్తున్నా బిజెపి చంకనెక్కిన చంద్రబాబు, పవన్ మాట్లాడడం లేదన్నారు. గతంలో గంగవరం పోర్టు స్టీల్‌ప్లాంట్‌కు అనుబంధంగా ఉండాలని కోరితే చంద్రబాబే అడ్డంపడిన విషయాన్ని గుర్తుచేశారు. స్టీల్‌ప్లాంట్ మనుగడకు మొట్టమొదటే చంద్రబాబునే దెబ్బకొట్టారని రాఘవులు ఉటంకించారు. సొంత గనుల్లేకుండా చంద్రబాబు హయాంలో ఎండగట్టారన్నారు. ఈ సమస్యలపై ప్రజాగళం వినిపించేందుకు కాంగ్రెస్ విశాఖ ఎంపీ అభ్యర్థి పి.సత్యారెడ్డిని, సిపిఎం గాజువాక ఎమ్మెల్యే అభ్యర్థి ఎం.జగ్గునాయుడులను గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ విశాఖ ఎంపీ అభ్యర్థి పి.సత్యారెడ్డి మాట్లాడుతూ రూ.4 లక్షల కోట్ల విలువైన వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను అమ్మేయాలని ప్రతిపాదన చేసిన కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌పైనా, ప్రధాని మోడీపైనా కేసు పెట్టి జైలుదాకా ఈడ్చుకెళ్తానని అన్నారు. సిపిఎం గాజువాక ఎమ్మెల్యే అభ్యర్థి ఎం.జగ్గునాయుడు మాట్లాడుతూ గాజువాక ప్రాంత సుస్థిర ప్రగతికి, కాలుష్యం లేని నగరంగా తీర్చిదిద్దేందుకు, స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలో ఉంచేందుకు తాను గెలిస్తే శాయశక్తులా కృషిచేస్తానని అన్నారు. ఈ సమావేశంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ఎజె.స్టాలిన్, విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ, కో - కన్వీనర్ జె.అయోధ్యరామ్, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు రమణ పాల్గొన్నారు.

ఉదయం ఎండ.. మధ్యాహ్నం వర్షం

సీలేరులో ఉదయం ఎండలో గొడుగేసుకుని వెళుతున్న వ్యక్తి .. మధ్యాహ్నం కురుస్తున్న వర్షం

ప్రజాశక్తి -సీలేరు : జీకే వీధి మండలం సీలేరు, దారకొండ, దుప్పిలివాడ పంచాయతీల పరిధిలో గురువారం ఈదురుగాలులు, ఉరుములతో కూడిన భారీ వర్షం కురిసింది. ఉదయం 7 గంటల నుంచి సూర్యుడు తన ప్రతాపాన్ని చూపడంతో ఉష్ణోగ్రత అధికంగా నమోదయ్యాయి. ఎండవేడికి ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఎండకు తాళలేక గొడుగులు చేతపట్టవలసిన పరిస్థితి నెలకొంది. అయితే గురువారం మధ్యాహ్నం 3.20 గంటలకు ఆకాశం మేఘావృతమై, ఈదురుగాలులు, ఉరుములుతో భారీ వర్షం కురిింది. వర్షానికి భూమి చల్లబడడంతో ఉష్ణోగ్రత తగ్గుముఖము పట్టింది. దీంతో ప్రజలు ఉపశమనం పొందారు.

ఈసారి గెలిపించకుంటే ఎన్నికల్లో పోటీ చేయను!

- ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కెఎ.పాల్

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్: విశాఖ ఎంపీగా, గాజువాక ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న తనను ఈ సారి గెలిపించకుంటే ముమ్ముందు ఎన్నికల్లో పోటీ చేయబోనని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కెఎ.పాల్ స్పష్టం చేశారు. గురువారం రైల్వే న్యూకాలనీలోని తన కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ, వైసిపి, ఎన్‌డిఎ కూటమిలలో ఎవరికి ఓటేసినా,వారు నెగ్గిన తర్వాత మోడీ భజన చేస్తారన్నారు. ఐదేళ్లలో ఇదే జరిగిందన్నారు. ఈసారైనా వారిని ఓడించాలని పిలుపునిచ్చారు.విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరించకుండా ఉద్యోగులు, నిర్వాసితులకు అప్పగిస్తే నడుపుకుంటారన్నారు. తాను గెలిస్తే వందరోజుల్లో విశాఖను అభివృద్ధి చేసి చూపిస్తానన్నారు. గెలవకపోతే, ఎన్నికల్లో పోటీ చేయబోనన్నారు.

ఎన్నికల్లో సమస్యలు సృష్టిస్తే చట్టపరమైన కఠిన చర్యలు

మాట్లాడుతున్న సిఐ అప్పలనాయుడు

ప్రజాశక్తి-సీలేరు : రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎవరైనా సమస్యలు సృష్టించడానికి ప్రయత్నిస్తే కఠిన చర్యలు తప్పవని జికె.వీధి సిఐ అప్పలనాయుడు హెచ్చరించారు. జీకే.వీధి మండలం దారకొండ పంచాయతీ పరిధి గిరిజన గ్రామాల్లో బుధ, గురువారాల్లో ఆయన విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా దారకొండ పంచాయతీ గంగవరంలో గిరిజనులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో సమస్యలు సృష్టించకుండా నిర్భయంగా, స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఎవరూ ఓటు వేయకుండా ఉండదొద్దని, పోలింగ్ బూత్‌లకు వెళ్లి తమ సమస్యలను పరిష్కరించే మంచి నాయకుడిని ఎన్నుకునే విధంగా ఓటు వేయాలని కోరారు. ఎవరైనా సమస్యలు సృష్టిస్తే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీలేరు ఎస్సై రామకృష్ణ పాల్గొన్నారు.

పోలీసుల కవాతు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : రాజవొమ్మంగి సీఐ సన్యాసినాయుడు, రాజవొమ్మంగి, జడ్డంగి ఎస్ఐలు ఎస్ వెంకయ్య, రఘునాథరావు ఆధ్వర్యంలో సిఆర్‌పిఎఫ్, ఏఆర్, ఏపిఎస్పి బెటాలియన్, రాజవొమ్మంగి, జడ్డంగి పోలీసు సిబ్బంది సయుక్తంగా రాజవొమ్మంగి, జడ్డంగి గ్రామాలలో గురువారం పోలీసు కవాత్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ సన్యాసినాయుడు మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికలు నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఓటర్లు ఎటువంటి ప్రలోభాలకు లొంగకుండా, స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. ఎన్నికలు శాంతియుతంగా జరగటానికి మండల ప్రజలు, అధికారులు, ఆయా రాజకీయ నాయకులు సహకరించాలని కోరారు. ఎవరైనా ఎన్నికల నిబంధనలు పాటించకపోయినా, శాంతి భద్రతలకు విఘాతం కలిగించినా చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయని హెచ్చరించారు.

కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

'ఇండియా'ను గెలిపించాలని బైక్ ర్యాలీ

బైక్ ర్యాలీలో పాల్గొన్న సిపిఐ అభ్యర్థి విమల, ఇండియా బ్లాక్ అభ్యర్థులు

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్ : ఇండియా బ్లాక్ తరుపున పోటీ చేస్తున్న పార్లమెంట్, అసెంబ్లీ అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ గురువారం కంచరపాలెంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు.విశాఖ పశ్చిమ నియోజకవర్గంలో కాంగ్రెస్, సిపిఎం, ఆమ్ ఆద్మీ తదితర ఇండియా బ్లాక్ పార్టీలు, భారత్ బచావోతో పాటు పలు ప్రజాసంఘాలు బలపరచిన సిపిఐ అభ్యర్థి అత్తిలి విమలకు కంకి కొడవలి గుర్తుపైనా, విశాఖ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి పి.సత్యారెడిడకి హస్తం గుర్తుపై ఇవిఎంలో సీరియల్ నెంబరు నాలుగులో ఉన్న గుర్తులపై బటన్ నొక్కి, ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు.

కంచరపాలెం మెట్టు వద్ద ప్రారంభమైన ర్యాలీలో సిపిఐ పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి అత్తిలి విమల, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పి.చంద్రశేఖర్, జిఎస్.జె అచ్యుతరావు, ఎం.మన్మథరావు, ఎస్.కె రెహమాన్, క్షేత్రపాల్, నాయకులు నల్లయ్య, నాగభూషణం, ఆదినారాయణ, పైలా ఈశ్వరరావు, గురుబాబు, ఎండి బేగం పాల్గొన్నారు.